# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 192
పేజీలు : 08 | వెల: రూ.5/-

మంగళవారం
ఏప్రిల్ 29, 2025

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




## 'భూ భారతి' రైతులకు శ్రీరామరక్ష

- అన్ని సమస్యలకు అదే పరిష్కారం
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

8లో..

## జూన్ 15 నాటికి పూడికతీత పూర్తి

- ప్రభుత్వ స్థలాల జాబితాను వెంటనే అందజేయాలి
- హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య
- భద్రకాళి చెరువు పూడికతీతపై అధికారులతో సమీక్ష



2లో..

## మే 15 నుంచి సరస్వతీ పుష్కరాలు

- 12 రోజుల పాటు కాశీ పండితులతో ప్రత్యేక హారతులు
- కలెక్టర్ రాహుల్ శర్మ
- అభివృద్ధి పనుల క్షేత్ర స్థాయి పరిశీలన



2లో..

## శ్రీ భద్రకాళీ, భద్రేశ్వరుల కళ్యాణ బ్రహ్మోత్సవాలకు.. అంకురార్పణ

- ప్రారంభించిన కుడా చైర్మన్ ఇనగాల
- ఉభయదాతలుగా వ్యవహరించిన కాపు కులస్తులు

8లో..




# 'వేం' చెబితేనే..



## ఆయనను కలిస్తే రేవంత్ ను కలిసినట్లే

- కాంగ్రెస్ లో ఆయనో షాడో లీడర్
- ఉమ్మడి జిల్లా రివ్యూలోనూ ఆయనదే హవా
- తెరచాటు రాజకీయాలతో నష్టపోతున్న పార్టీ
- టీడీపీ మూలాలున్న నేతలకే పెద్దపీట
- అసలైన కాంగ్రెస్ వాదులకు గుర్తింపు లేదంటున్న నేతలు



వేం నరేందర్ రెడ్డి.. పరిచయం అక్కరలేని వ్యక్తి. 2004లో మహబూబాబాద్ నియోజకవరం నుంచి తెలుగు దేశం పార్టీ అభ్యర్థిగా తొలిసారి పోటీ చేసి ఎమ్మెల్యేగా అసెంబ్లీలో అడుగుపెట్టారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అక్టోబర్ 2017లో తెలుగుదేశం పార్టీకి, శాసనసభ సభ్యత్వానికి రేవంత్ రెడ్డి రాజీనామా చేయడంతో ఆయనతో బాటలోనే వేం నరేందర్ రెడ్డి పయనించి టీడీపీ సభ్యత్వానికి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఓటుకు నోటు కేసు వీరిద్దరినీ ఆప్త మిత్రులుగా మార్చింది. సీఎం ప్రాణ స్నేహితుడిగా గుర్తింపు పొందిన ఆయన ఇప్పుడు కాంగ్రెస్ లో షాడో లీడర్. ఆ నేతను కలిస్తే రేవంత్ రెడ్డిని కలిసినట్లే అంటూ ప్రచారం. ఆయన హామీ ఇస్తే రేవంత్ హామీ ఇచ్చినట్టే. అయితే వేం నరేందర్ రెడ్డి దయ లేనిదే ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో గడ్డి పోచను కూడా కదల్చలేమన్న ప్రచారం సాగుతోంది. ఉమ్మడి జిల్లా రివ్యూల్లోనూ పాల్గొంటూ తన హవా కొనసాగిస్తున్నారు. టీడీపీ మూలాలున్న నేతలకే నామినేటెడ్ పదవులతోపాటు ఇతర అవకాశాల్లో పెద్దపీట వేస్తూ అసలైన కాంగ్రెస్ వాదులను పక్కన బెట్టడంపై పార్టీ వర్గాల్లో ఆందోళన నెలకొంది. సీనియర్ కాంగ్రెస్ నేతలకు సైతం వేధింపులు తప్పడం లేదంటున్నారు. ఆయన తెరచాటు రాజకీయాలతో పార్టీ తీవ్రంగా నష్టపోతుందంటున్నారు. కనీసం సీఎం అపాయింట్ మెంట్ కూడా ఇప్పించడంలేదంటూ మండి పడుతున్నారు.


– వరంగల్ వాయిస్ ప్రతినిధి

వివరాలు 2లో..

# 'వేం' చెబితేనే..

## ఆయనను కలిస్తే రేవంత్ ను కలిసినట్లే





వరంగల్ వాయిస్, ఫైల్ ఫోటో

- కాంగ్రెస్ లో ఆయనో షాడో లీడర్
- ఉమ్మడి జిల్లా రివ్యూలోనూ ఆయనదే హవా
- తెరచాటు రాజకీయాలతో నష్టపోతున్న పార్టీ
- టీడీపీ మూలాలున్న నేతలకే పెద్దపీట
- అసలైన కాంగ్రెస్ వాదులకు గుర్తింపు లేదంటున్న నేతలు

**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మనసెరిగిన నేతగా ఉంటూ ఇటు పార్టీ వ్యవహారాలతో పాటు రేవంత్ రెడ్డి రాజకీయాలను కూడా వేం నరేందర్ రెడ్డే చక్కబెడుతున్నారు. ఒక నాడు వైఎస్ కు కేవీపీ ఎలా ఉన్నారో ఇప్పుడు రేవంత్ రెడ్డికి ఆ నేత ఆత్మలా మారాడంటూ ప్రచారం సాగుతోంది. టీడీపీలో ఉండగా రేవంత్ రెడ్డి, నరేందర్ రెడ్డి మధ్య స్నేహబంధం ఏర్పడింది. అది మరింత బలపడి ఇప్పుడు కూడా కొనసాగుతుంది. రేవంత్ రెడ్డి కష్ట నష్టాల్లో అడుగడుగునా నరేందర్ రెడ్డి ఉన్నారని రేవంత్ సన్నిహితులు చెబుతుంటారు. ఒక రకరంగా చెప్పాలంటే రేవంత్ తన సోదరులను ఏవిధంగా నమ్ముతారో అదే స్థాయిలో నరేందర్ రెడ్డిని నమ్ముతారని ప్రచారంలో ఉంది. రేవంత్ రెడ్డి గతంలో ఎదుర్కొన్న రాజకీయ తీవ్ర ఆటుపోట్లలో కూడా ఆయన రేవంత్ రెడ్డికి భరోసాగా నిలిచారని చెప్పుకొంటున్నారు.

### టీడీపీ మార్క్..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇప్పుడంతా వేం నరేందర్ రెడ్డి జపం సాగుతోంది. ఆయన దయ లేనిదే మనుగడ కష్టం అన్న భావన వ్యక్తమవుతోంది. ఆయన



మనుషులుగా జిల్లాలో చలామణి అవుతున్న నేతలకు మినహా మరెవ్వరికీ పనులు కావడం లేదన్న అపవాదు ఉంది. ఉమ్మడి జిల్లా రివ్యూ సమావేశాల్లోనూ ఆయన పాల్గొంటూ తన హవా కొనసాగిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఎంపీ, ఎమ్మెల్యే జాన్తా నహి.. అంతా 'వేం' అన్నట్లుగా వ్యవహారం సాగిస్తున్నట్లు చెప్పుకొంటున్నారు. తెలుగుదేశం పార్టీ మూలాలున్న వారిని మాత్రమే ఆయన ప్రోత్సహిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. టీడీపీ మూలాలు కలిగిన కొందరు వేం నరేందర్ రెడ్డి అండ చూసుకొని నగరంలో ఇష్టారీతిగా వ్యవహరించడంతో పార్టీ పరువు పోతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

### కాంగ్రెస్ కు మొండిచేయి..

కష్ట కాలంలో పార్టీకి అండగా నిలిచి అధికారంలోకి వచ్చేందుకు శాయశక్తులా పనిచేసిన నిజమైన కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు పార్టీలో కనీస గుర్తింపు లభించడంలేదన్న ఆవేదన వ్యక్తమవుతోంది. పార్టీని కాకుండా వేం నరేందర్ రెడ్డిని నమ్ముకున్న వారికే న్యాయం జరుగుతోందన్న ప్రచారం సాగుతోంది. ఆయన తెరచాటు రాజకీయాలు చేస్తూ పార్టీని భ్రష్టు పట్టిస్తున్నారని అసలైన కాంగ్రెస్ వాదులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వలస వచ్చిన నేతలకు, టీడీపీ మూలలున్న వారికి పెద్ద పీట వేస్తున్నారంటూ మదన పడుతున్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉండగా అనుభవించిన కష్టాలు, అవమానాలకు ఫలితం లేకపోగా కొత్తగా పార్టీలోకి వచ్చిన వారినుంచి కూడా అవమానాలకు గురి కావాల్సి వస్తుందంటున్నారు. మొదటి నుంచి పార్టీని నమ్ముకున్న వారికి న్యాయం జరుగడంలేదంటున్నారు.

### ఆయన దయ..

ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో వేం నరేందర్ రెడ్డికి తెలియకుండా గడ్డి పోచ కూడా కదలదం లేదన్న ప్రచారం సాగుతోంది. అందరితో ఆయన తీపిగా మాట్లాడుతూనే అసలైన కాంగ్రెస్ వాదులను పక్కనబెడుతున్నారన్న ఆరోపణలున్నాయి. నామినేటెడ్ పదవులకోసం దరఖాస్తులు ఇస్తే చూద్దాం అంటూ దాటవేయడం తప్ప సీఎంకు రికమండ్ చేయడంలేదంటున్నారు. సీనియర్ కాంగ్రెస్ నేతలకు సైతం భరోసా ఇవ్వడంలేదంటున్నారు. కనీసం సీఎం అపాయింట్ మెంట్ అడిగినా ఇప్పంచడంలేదంటూ అసలైన కాంగ్రెస్ వాదులు గుర్రుగా ఉన్నారు. వ్యక్తిగత అవసరాలు, పార్టీ విషయాలపై చర్చించేందుకు సీనియర్ కాంగ్రెస్ నేతలు ఫోన్ చేసినా సదరు ముఖ్యమంత్రి ప్రాణ స్నేహితుడు ఎత్తడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇతని పెత్తనం కారణంగా ఎమ్మెల్యేలు చెప్పినా అధికారులు పనులు చేయడం లేదంటున్నారు. అన్నీ తానై వేం నరేందర్ రెడ్డి వ్యవహరించడంతో స్థానికంగా పార్టీకి చెడ్డపేరు వస్తోందంటున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే రానున్న రోజుల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో పార్టీ మనుగడ కష్టంగా మారుతుందని హెచ్చరిస్తున్నారు.

## జూన్ 15 నాటికి పూడికతీత పూర్తి

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరంలోని భద్రకాళి చెరువు పూడికతీత పనులు మరింత వేగవంతంగా సాగాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. జూన్ 15 నాటికి పూడికతీత పూర్తిచేయాలని ఆదేశించారు. రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం భద్రకాళి చెరువు పూడికతీత మట్టిని డంపింగ్ చేయడానికి ప్రతిపాదిత ప్రభుత్వ స్థలాలను వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, రెవెన్యూ, సాగునీటిపారుదల, కుడా, ఇతర శాఖల అధికారులతో కలిసి హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పూడికతీత పనులకు సంబంధించి ఇప్పటివరకు చేపట్టిన పనుల పురోగతిని పరిశీలించి వాటి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పూడికతీత మట్టిని డంపింగ్ చేసేందుకు ప్రతిపాదిత డంపింగ్ స్థలాలను కలెక్టర్లు, అధికారులు పరిశీలించారు. అనంతరం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో భద్రకాళి చెరువు పూడికతీత పనులను మరింత వేగవంతం చేయడంపై సంబంధిత శాఖల అధికారులతో ఇరు జిల్లాల కలెక్టర్లు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ భద్రకాళి చెరువు పూడికతీత పనుల్లో భాగంగా బ్లాకుల వారీగా మట్టిని తీసి బయటకు పంపించాలన్నారు. గడువులోగా పూడికతీత మట్టి తరలింపునకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలన్నారు. నిర్ణీత గడువు జూన్ 15వ తేదీ నాటికి పూడికతీత పనులు పూర్తి కావాలన్నారు. గడువు దగ్గరలోనే ఉన్నందున మట్టి తరలింపు ప్రక్రియను మరింత వేగవంతంగా కొనసాగించాలన్నారు. తమ పొలాల్లోకి చెరువు మట్టిని తీసుకెళ్లేందుకు ఆసక్తి ఉన్న రైతులు సాగునీటి పారుదల శాఖ అధికారులను సంప్రదించాలన్నారు. ఈ సమావేశంలో హనుమకొండ, వరంగల్ ఆర్డీఓలు రాథోడ్ రమేష్, సత్యపాల్ రెడ్డి, సాగునీటి పారుదల శాఖ ఎస్ఈ వెంకటేశ్వర్లు, ఈఈ శంకర్, కుడా పీవో అజిత్ రెడ్డి, ఈఈ భీమ్ రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## మే 15నుంచి సరస్వతీ పుష్కరాలు

- 12 రోజుల పాటు కాశీ పండితులతో ప్రత్యేక హారతులు
- కలెక్టర్ రాహుల్ శర్మ



**వరంగల్ వాయిస్, మహాదేవపూర్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరంలో మే 15నుంచి జరుగనున్న సరస్వతీ పుష్కరాల సందర్భంగా చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను మంగళవారం కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి వివిధ శాఖల అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. వీఐపీ ఘాట్, సరస్వతి మాతా విగ్రహం, టెంట్ సిటీ, పార్కింగ్ ప్రదేశాలు, జాయ్ రైడ్, సత్రం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్న ప్రదేశాల్లో వారు పర్యటించారు. అనంతరం ఈఓ కార్యాలయంలో పనులు పర్యవేక్షణపై రెవెన్యూ, పోలీస్, దేవాదాయ, ఇరిగేషన్, విద్యుత్, ఆర్ డబ్ల్యూఎస్, పీఆర్, రవాణా, వైద్య తదితర శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 15 నుంచి 26 వరకు నిర్వహించనున్న సరస్వతీ పుష్కరాల్లో 12 రోజుల పాటు కాశీ నుంచి వచ్చిన పండితులతో ప్రత్యేక హోమాలు, హారతులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పుష్కరాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కానున్న నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వీఐసీ ఘాట్ వద్ద టెంట్ సిటీ, ఎగ్జిబిషన్, ఫుడ్ కోర్టు, స్టాళ్లు, కిడ్స్ జోన్ తదితర ఏర్పాట్లు చేయాలని తహసీల్దార్ ను ఆదేశించారు. అదే విధంగా వీఐపీ ఘాట్ రహదారి నిర్మాణానికి మార్కింగ్ చేయాలన్నారు. జాయ్ రైడ్ చేసేందుకు కౌంటర్ ఏర్పాటు చేయాలన్నారు. సమయం దగ్గరపడుతున్నందున పనుల్లో వేగం పెంచాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పుష్కరాలను అత్యంత ఘనంగా నిర్వహించేలా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. పుష్కరాల సందర్భంగా వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ప్రత్యేక ఘాట్లు, తాత్కాలిక వసతి కేంద్రాలు, ఆరోగ్య శిబిరాలు, తాగునీటి ఏర్పాట్లు, పరిశుభ్రత చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలన్నారు. ఈ పుష్కరాలలో ప్రత్యేకంగా ప్రతి రోజు సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు స్టేజి ఏర్పాట్లు, విద్యుద్దీకరణ చేపట్టాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు ప్రవచన కార్యక్రమాలు కూడా నిర్వహించాలన్నారు. రెవెన్యూ, పోలీస్, దేవాదాయ శాఖల అధికారులు సంయుక్తంగా పార్కింగ్ ప్రదేశాలను గుర్తించి విద్యుద్దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. విధులు నిర్వహించే సిబ్బందికి నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లు, పార్కింగ్, ఆర్టీసీ ప్రదేశాల్లో సురక్షితమైన తాగు నీరు సరఫరా చేయాలని తెలిపారు. భక్తులు నదిలోకి వెళ్లడానికి అనువుగా ఏర్పాట్లు చేయాలని, ఎండ నుంచి రక్షణ కోసం చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, విద్యుత్ శాఖ ఎస్ఈ మల్హార్ నాయక్, దేవాదాయ శాఖ ఎస్ఈ కనక దుర్గా ప్రసాద్, డీపీఓ నారాయణ రావు, పరిశ్రమల శాఖ జీఎం సిద్దార్థ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మధు సూదన్, ఇరిగేషన్, పంచాయతి రాజ్, ఆర్ డబ్ల్యూఎస్ ఈఈలు తిరుపతి రావు, వెంకటేశ్వర్లు, నళిని, ఆబ్కారీ ఈఎస్ శ్రీనివాస్, కాటారం డీఎస్పీ రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మండుటెండల్లో ఉపాధి పనులు

- పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కరువు
- ఇబ్బందులు పడుతున్న ఉపాధి కూలీలు



**వరంగల్ వాయిస్, మల్హర్ :** గ్రామాల్లో వలసలను నివారించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకువచ్చిన ఉపాధి హామీ పనులు గత నెల రోజులుగా ఊపందుకున్నాయి. మండు వేసవిలో పెద్ద సంఖ్యలో కూలీలు ఉపాధి పనులకు వెళ్తున్న వారికి కనీస సౌకర్యాలు అయిన మంచి నీరు, నీడ, మెడికల్ కిట్లు అందజేయడంలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూలీలు చస్తే చావని తమకేంటి అన్నట్లుగా మొండి గా వ్యవహరిస్తున్నారు. కనీసం పని ప్రదేశంలో తాగు నీరు కూడా అందించడం లేదని, గత్యంతరం లేని పరిస్థితుల్లో ఇంటి దగ్గరి నుంచి మంచి నీరు తెచ్చుకుంటున్నామరిచ ఎండలు ఎక్కువగా ఉండటంతో ఆ నీరు వేడెక్కి తాగడానికి వీలు లేకుండా ఉంటుందని కూలీలు వాపోతున్నారు.

### ప్రశ్నిస్తే కక్ష సాధింపు చర్యలు..

గత కొన్ని రోజులుగా 40 డిగ్రీల పైనే ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండటంతో చాలా వరకు కూలీలు పని ప్రదేశంలో వడ దెబ్బకు గురై ఆసుపత్రుల పాలవుతున్నారు. తమ గ్రామాల నుంచి దాదాపు 10 కిలో మీటర్ల దూరంలో పని ప్రదేశం ఉండటంతో ట్రాక్టర్ లు, ఆటోలలో రోజుకి రూ.50 వెచ్చించి పనికి వెళ్లి పనులు చేస్తున్న కనీస వేతనం కూడా గిట్టు బాటు కావడం లేదని, పని ప్రదేశంలో మంచి నీరు కోసం అడిగితే అధికారులు దురుసుగా ప్రవర్తిస్తున్నారని చెబుతున్నారు. మీరు చేసే పనికి మంచి నీరు కూడా కావాలా కొలతల ప్రకారం చేస్తే చేయండి లేకుంటే పని మానేయండని దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఉపాధి కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీస సౌకర్యాలు అడిగిన వారిపై క్షేత్ర స్థాయి సిబ్బంది కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఎండల్లో పని చేస్తున్న ఉపాధి కూలీలకు కనీస సౌకర్యాలు అందేలా చర్యలు తీసుకోవాలని,కూలీల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్న క్షేత్ర స్థాయి సిబ్బంది పై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# జర్నలిస్టుల హక్కులకై బీజేపీ నిరసన దీక్ష




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ జిల్లా బీజేపీ ఆధ్వర్యంలో ఈ నెల 30న హనుమకొండలోని ఏకశిలా పార్క్‌లో జర్నలిస్టుల హక్కుల కోసం శాంతియుత నిరసన దీక్ష నిర్వహించనున్నట్టు బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీరంగం సాగర్ తెలిపారు. జిల్లా అధ్యక్షుడు గంట రవి కుమార్ సూచనల మేరకు ఈ దీక్ష చేపట్టనున్నారు. అర్హత కలిగిన జర్నలిస్టులకు రాష్ట్ర ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నిరసన కార్యక్రమం నిర్వహించనున్నారు. దీని కోసం హనుమకొండ జిల్లా ఏసీపీని కలిసి సభకు అనుమతి కోరుతూ పర్మిషన్ లెటర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కనుకుంట్ల రంజిత్, అధికార ప్రతినిధి ఆడెపు వెంకటేష్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీరంగం సాగర్ మాట్లాడుతూ పత్రికా రంగం సమాజానికి నాల్గవ స్థంభంగా పనిచేస్తోంది. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో జర్నలిస్టుల పాత్ర అమూల్యమైనది. అయితే ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల జర్నలిస్టులకు న్యాయమైన జీవన భద్రత లభించడం లేదని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అర్హులైన జర్నలిస్టులకు ఇవ్వాలని హామీ ఇచ్చి మోసం చేసింది. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఇళ్లను "ఇందిరమ్మ ఇల్లు"గా పేరు మర్చి జర్నలిస్టులకు ఇళ్లు కేటాయించడంలో తీవ్ర నిర్లక్ష్యం చూపుతోందని విమర్శించారు. గత పదిహేను రోజులుగా జర్నలిస్టులు శాంతియుతంగా ధర్నాలు చేస్తూ తమ హక్కుల కోసం పోరాడుతున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. రేపు 30న హనుమకొండ ఏకశిలా పార్కు వద్ద జర్నలిస్టుల హక్కులకు మద్దతుగా నిర్వహించే దీక్షలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని శ్రీరంగం సాగర్ పిలుపునిచ్చారు.

# మంత్రి పొంగులేటిని కలిసిన చిప్ప వెంకటేశ్వర్లు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన భూభారతి చట్టం (ఆర్ఓఆర్) –2025 అమలులో భాగంగా మంగళవారం వరంగల్ ఉర్సు గుట్ట సమీపంలోని నానీ గార్డెన్స్ లో నిర్వహించిన వరంగల్, ఖిలా వరంగల్ మండలాల అవగాహన సదస్సు కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి టీపీసీసీ చేనేత విబాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు నేత మంత్రి కొండా సురేఖ సూచనల మేరకు కొత్తవాడ చేనేత కార్పెట్ (దర్రీ) బహూకరించి నూలు దండ వేశారు. ఈ సందర్భంగా మరోసారి వరంగల్ జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు మా చేనేత సంఘాలను సందర్శించాలని కోరారు. చేనేత సంఘాలకు త్వరలో ఎన్నికలు నిర్వహించాలని, ఇటీవల చేనేత బకాయిలు రద్దు పరచి త్రిఫ్ట్ పథకాన్ని పునర్ ప్రారంభించినందుకు ఇద్దరు మంత్రులకు కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో చేనేత పద్మశాలీ నాయకులు బాసాని కరుణాకర్, దాసరి రాజశేఖర్, కుసుమ సతీష్ తదితరులు పాల్గొన్నారు,

# ఆపరేషన్ కగార్‌ను తక్షణమే ఆపేయాలి




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఆపరేషన్ కగార్ ను తక్షణమే నిలిపివేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని ఆదివాసి, దళిత, గిరిజన, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టి ఆపరేషన్ కగార్ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్ మూలంగా నిరాయుదులైన ఆదివాసీలు, మహిళలు, చిన్నపిల్లలు ప్రాణాలు కోల్పోతున్నారని, ప్రజలు సాధారణ జీవితం గడపలేక భయాందోళనలు చెందుతున్నారని, తాగు నీరును కూడా సేకరించుకోలేని దీన స్థితిలో చనిపోయే స్థితికి చేరుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి సైనిక చర్యను నిలిపి వేసి, ఆదివాసి ప్రాంతంలో అభివృద్ధిని స్థాపించుటకు తక్షణం మావోయిస్టులతో చర్చలు జరపాలని కోరారు. నేడు ముసుగులో జరిగే శాంతి ర్యాలీలో ప్రజలు, ప్రజాస్వామికవాదులు, వివిధ ప్రజాసంఘాలు, కుల సంఘాల నాయకులు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దళిత, గిరిజన, ఆదివాసి, ప్రజాసంఘాల నాయకులు సోమ రామ్మూర్తి, జిలుకర శ్రీనివాస్, మాదాసి సురేష్, బొట్ల భిక్షపతి, జై సింగ్ రాథోడ్, నున్న అప్పారావు, సిద్ధమైన లక్ష్మీనారాయణ, తెలంగాణ కొమురయ్య, ఐతం నగేష్ బాదావత్ రాజు, అజ్మీర వెంకట్, సిద్దిరాజు యాదవ్ పాల్గొన్నారు.

# మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసిన జర్నలిస్టులు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి, జిల్లా ఇంచార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి జర్నలిస్టుల ప్రధాన సమస్యల పరిష్కారం గురించి మంగళవారం వినతి పత్రం అందించారు. వరంగల్ ఉర్సు గుట్ట సమీపంలోని నాని గార్డెన్స్ లో మంగళవారం జరిగిన భూభారతి పై ప్రజలకు అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఇంచార్జి మంత్రి పొంగులేటిని టీయూడబ్ల్యూ జే (ఐజే యూ) జిల్లా అధ్యక్షులు శ్రీరామ్ రామచందర్, ప్రధాన కార్యదర్శి మట్టా దుర్గాప్రసాద్, జిల్లా కమిటీ బాధ్యులు కలిసి జర్నలిస్టుల చిరకాల వాంఛ అయిన డబల్ బెడ్ రూమ్ ఇండ్లను, ఇళ్ల స్థలాలను వరంగల్ జిల్లాలోని వర్కింగ్ జర్నలిస్టులకు కేటాయించాలని వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా యూనియన్ ఉపాధ్యక్షులు కూర్న వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శులు బొమ్మినేని సతీష్ గౌడ్, చిర్ర రాజు, కమిటీ సభ్యులు ఎండీ అక్రం, ఎండీ. బాబర్, ఎండీ.బషీర్, సీనియర్ యూనియన్ నాయకులు పెరుమాండ్ల మధుసూదన్, కందుల శ్రీధర్, నిమ్మకాయల నరేష్, సిద్దోజు నితీష్, పారిజాతం, సంతోష్ కుమార్, పేసరి రాజేంద్రప్రసాద్, రజిని నాయుడు, తదితర జర్నలిస్టులు పాల్గొన్నారు.

# మే డేను జయప్రదం చేయండి

### తాటిపాముల వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మే1న మేడేను ఊరూర వాడవాడల అరుణ పతాకాలు ఎగురవేసి ఘనంగా నిర్వహించాలని, శ్రామిక హక్కుల పరిరక్షణ కోసంపోరాడేందుకు ప్రతిన బూనాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు పిలుపునిచ్చారు. 139 సంవత్సరాల క్రితం అమెరికాలోని చికాగో నగరంలో 8 గంటల పనిదినం కోసం కార్మికులు జరిపిన పోరాటంలో రక్త తర్పణ చేసి అసువులు బాసిన అమరవీరుల త్యాగంతో స్ఫూర్తితో ప్రపంచవ్యాప్తంగా, మనదేశంలో కార్మిక వర్గం అనేక పోరాటాలు చేసి ఎన్నెన్నో హక్కులను సాధించిందన్నారు. పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను నేటి పాలకులు కాల రాస్తున్నారని, పెట్టుబడిదారీ దోపిడీ వర్గాలకు ఊడిగం చేస్తూ కార్మిక చట్టాలను రద్దు చేయడం దుర్మార్గమన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక ప్రయోజనాలకు భంగం కలిగించే నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలన్నారు. దోపిడీ వ్యవస్థను అంతం చేసి ఒక మనిషి మరొక మనిషిని దోపిడీ చేయుటకు వీలు లేని సమ సమాజ నిర్మాణం కోసం పోరాడేందుకు మే దినోత్సవం సందర్భంగా సకల శ్రామిక జనావళి దీక్ష బూనాలని వెంకట్రాములు విజ్ఞప్తి చేశారు.

# వేసవి శిబిరానికి దరఖాస్తుల ఆహ్వానం




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మాధవ స్మారక సమితి హనుమకొండ కాకాజీ కాలనీలోని శ్రీ వివేకానంద యోగా కేంద్రంలో 8రోజుల పాటు నిర్వహించే బాల గోకులం వేసవి ఉచిత శిక్షణ శిబిరానికి ఐదు నుంచి పది తరగతులు పూర్తి చేసిన విద్యార్థినీ, విద్యార్థులు ఈ నెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని సమితి అధ్యక్షులు డాక్టర్ కోదాటి సుధాకర్ రావు ఒక ప్రకటనలో కోరారు. మే 1నుంచి 8 వరకు నిర్వహించే ఈ వేసవి ఉచిత శిక్షణ శిబిరంలో విద్యార్థినీ, విద్యార్థులకు ఆధ్యాత్మిక, మానసిక ,శారీరక, బౌద్ధిక వ్యక్తిత్వ వికాసంపై అనుభవజ్ఞులైన విద్యా నిపుణులు, శిక్షకులతో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థినీ, విద్యార్థులు 9440720624, 9849685002 మొబైల్ నెంబర్ కు ఫోన్ చేసి శిక్షణకు వచ్చే విద్యార్థుల విద్యార్థులు తమ తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు.

# భూ భారతితో రైతుల సమస్యలు పరిష్కారం



**● హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య**

**వరంగల్ వాయిస్, నడికూడ :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన భూ భారతి చట్టం రైతుల భూ సమస్యలన్నిటికీ పరిష్కారం లభిస్తుందని హనుమకొండ జిల్లా కలెక్టర్ కె.ప్రావీణ్య తెలిపారు. మంగళవారం నడికూడ మండలంలో భూ భారతి కొత్త ఆర్ఓఆర్ చట్టం–2025 పై అవగాహన కార్యక్రమాన్ని తాహసీల్దార్ కే నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ధరణి స్థానంలో భూ హక్కుల రికార్డు భూ భారతిని తీసుకొచ్చిందని, హక్కుల రికార్డులలో తప్పుల సవరణకు అవకాశం ఉంటుందన్నారు. పెండింగ్ సాదా బై నామ దరఖాస్తుల పరిష్కారానికి, వారసత్వంగా వచ్చిన భూములకు మ్యూటేషన్ చేసే ముందు నిర్ణీత కాల పరిమితితో రిజిస్ట్రేషన్, భూ సమస్యల పరిష్కారానికి రెండంచల ఆప్పీల్ వ్యవస్థ, భూధార్ కార్డుల జారీ, రైతులకు ఉచిత న్యాయ సహాయం వంటి సదుపాయాలు భూ భారతి చట్టంతో లభిస్తాయన్నారు. మోసపూరిత పట్టాలను రద్దు చేసే అధికారం భూ భారతితో లభిస్తుందన్నారు. ధరణిలో అప్పీల్ వ్యవస్థ లేదని భూభారతితో 90 శాతం భూ సమస్యలు జిల్లా స్థాయిలోనే పరిష్కరించబడతాయని తెలిపారు. గతంలో ధరణి వల్ల తలెత్తిన సమస్యలకు భూ భారతితో సమస్యలు పరిష్కరించబడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కే.నారాయణ, ఎంపీడీవో జి.విమల, ఏవో పోరిక జై సింగ్, అధికారులు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.



# నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలి

**వరంగల్ వాయిస్, వరంగల్ :** మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని వరంగల్ బట్టల బజార్ లో షాపు గుమస్తాల ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ లు పెట్టి సమ్మె కరపత్రాలను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆల్ షాప్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ముక్కెర రామస్వామి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ 2025 మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జరగబోతుంది. అందులో వరంగల్ జిల్లాలో ఉన్న వివిధ షాపులలో షాపింగ్ మాల్ లో పనిచేస్తున్న గుమాస్తా కార్మికులు సమ్మెను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను, కార్పొరేటు అనుకూలంగా మతోన్మాద చర్యలను మరింత దూకుడు పెంచుతుంది. కార్మిక వర్గం సమరశీల పోరాటాల ద్వారా 100 సంవత్సరాల్లో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్స్ ను ముందుకు తీసుకొచ్చిందన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా గత ఐదు సంవత్సరాలుగా కార్మిక వర్గం ఆందోళన పోరాటాలను చేస్తున్న లేబర్ కోడ్స్ ను ఈ ప్రభుత్వం వెనక్కి తీసుకోవడం లేదు. కార్మిక హక్కులను కాలరాస్తూ పెట్టుబడుదారులకు యాజమాన్లకు కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా చట్టాలను తయారు చేస్తూ కార్మికం వర్గం పొట్ట



కొట్టే విధంగా బీజేపీ ప్రభుత్వం ప్రయత్నం కొనసాగుతుందన్నారు. ఒక పక్కన గుమాస్తా కార్మికులు చాలీచాలని వేతనాలతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ కుటుంబాలను పోషించుకోలేక అనేక ఇబ్బందులు గురవుతుంటే, ఉన్న చట్టాలను ఎత్తివేసిన తర్వాత ఈ యజమానుల కింద కట్టు బానిసలుగా పనిచేసే పరిస్థితి దాపురిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పని భద్రత, ఈఎస్ఐ, పీఎఫ్, బోనస్ అమలు కాక పని గంటల పెంపుతో గుమాస్తా కార్మికులు అనేక ఇబ్బందులకు గురవడంతో పాటు చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నారన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా నెలకు 26 వేల రూపాయల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధనకై మే 20న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాగుల ప్రసాదు, రమేష్, ఎండీ మాషిక్, మద్ది రాకేష్, గడ్డం నారాయణ రాజు, వీరస్వామి, పద్మ, నందిని తదితరులు పాల్గొన్నారు.

# 30న శ్రీకాంతా చారి మెమోరియల్ అవార్డుల ప్రధానం



**వరంగల్ వాయిస్, జనగామ :** ఈనెల 30న రంగారెడ్డి జిల్లాలో నింగి నేల మేము సైతం మీ ఆత్మీయ నేస్తం స్వచ్ఛంద సేవా సంస్థ అధ్వర్యంలో తెలంగాణ మలి విడత తొలి అమరుడు శ్రీకాంతా చారి మెమోరియల్ అవార్డ్స్ 2025 అవార్డులు కొంత మంది జనగామ జిల్లా తెలంగాణ ఉద్యమకారులకు అందజేస్తున్నామని తెలంగాణ ఉద్యమ కణం, ఓయూ జేఏసీ చైర్మన్ దరువు అంజన్న అన్నారు. జనగామ జిల్లా కేంద్రం విజయ కాన్ఫరెన్స్ హాల్ లో మంగళవారం నాడు కవులు, కళాకారుల ఐక్యవేదిక అధ్వర్యంలో శ్రీకాంత్ చారి మెమోరియల్ అవార్డ్స్ 2025 కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ఐక్యవేదిక అధ్యక్షులు జి.కృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా దరువు అంజన్న మాట్లాడుతూ ఈనెల 30 బుధవారం నాడు ఉదయం 10.30 గంటలకు మల్లారెడ్డి గార్డెన్, బడంగ్ పేట్, బాలా పుర్, రంగారెడ్డి జిల్లాలో అవార్డు ప్రధానం చేస్తారని అన్నారు. తెలంగాణ రాష్ట్రములోని 33 జిల్లాలోని తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారులు, కళాకారులకు శ్రీకాంత్ చారి పేరిట అవార్డులు యిస్తున్నామని తెలిపారు. అలాగే, జనగామ జిల్లా నుంచి ఉద్యమకారులు, కళాకారులను కొంత మందిని గుర్తించామన్నారు. వీరిలో దిగోజు నర్సింహచారి, అయిలా సొమనర్సింహచారి, మద్దోజు గంగా భవానీ, జి.కృష్ణ, పెట్లోజు సోమేశ్వరాచారి, గట్టగల్ల సంజీవ, గజవెల్లి ప్రతాప్, చిలుమోజు సాయికిరణ్, సురేష్ మహాజన్, మేడ సుధాకర్ ఉన్నారని ఆయన వివరించారు. ఈ కరపత్రం ఆవిష్కరణ కార్యక్రమంలో అవార్డు గ్రహీతలు జి.కృష్ణ, పెట్లోజు సోమేశ్వరాచారి, గజవెల్లి ప్రతాప్, చిలుమోజు సాయికిరణ్, జనగామ రచయితల సంఘం అధ్యక్షులు నక్క సురేష్, రంగరాజు ప్రసాద్, అఫ్జల్, గుండె కనకయ్య, ఉమాపతి, కుమార్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# గద్దల ప్రేమ్ కుమార్‌కు డాక్టరేట్



**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ యూనివర్సిటీ ఆంగ్ల విభాగంలో పరిశోధకులు గద్దల ప్రేమ్ కుమార్ డాక్టరేట్ సాధించాడు. "మల్టీ కల్చరలిజం ఇన్ నీల్ బిసుందత్ ఫిక్షన్ లో బహుళ జాతివాదం" అనే అంశంపై చేసిన వివరణాత్మక పరిశోధనకు కాకతీయ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటిస్తున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్ తెలిపారు. కాకతీయ యూనివర్సిటీ కి చెందిన ఆంగ్ల విభాగం ప్రొఫెసర్ ఎం.ప్రభాకర్ పర్యవేక్షణలో గద్దల ప్రేమ్ కుమార్ పరిశోధన పూర్తి చేశారు. అలాగే జాతీయ, అంతర్జాతీయ సెమినార్లలో పలు పరిశోధన పత్రాలను సమర్పించారు. వరంగల్ జిల్లా కేంద్రంలోని ఖిలా వరంగల్ కు చెందిన గద్దల ప్రేమ్ కుమార్ సీకేఎం కాలేజీలో గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా డాక్టరేట్ సాధించిన గద్దల ప్రేమ్ కుమార్ ను యూనివర్సిటీ ప్రొఫెసర్లు, పరిశోధక విద్యార్థులు, సహుద్యోగులు అభినందనలు తెలిపారు.

# ఆపరేషన్ కగార్ ఆపాలి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపివేయాలని, ఆదివాసీలపై కేంద్ర ప్రభుత్వం నడుపుతున్న సాయుధ యుద్ధాన్ని ముగించాలని గాదగోని రవి డిమాండ్ చేశారు. అటవీ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పగించకుండా, రాజ్యాంగబద్ధంగా కల్పించిన ప్రజాస్వామిక హక్కులను పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం శాంతి చర్చలు జరపాలని, ఇందుకు కేంద్రం మరియు రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మే 2న బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించే రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర కార్యాలయం ముగ్దుంభవన్‌లో జరిగిన వామపక్ష పార్టీల ప్రెస్ మీట్‌లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇలాంటి సమావేశాల ద్వారా ప్రజాస్వామ్య పరిరక్షణకు మద్దతుగా సమూహ బలాన్ని కేంద్రీకరించాలని నాయకులు అభిప్రాయపడ్డారు.

# ఉదారత చాటుకున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

## బాలిక విద్యాభ్యాసానికి ఆర్థిక సహాయం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని నాని గార్డెన్స్‌లో జరిగిన భూభారతి చట్టం–2025 అవగాహన కార్యక్రమంలో పాల్గొనడానికి వేదిక వద్దకు చేరుకున్న రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అక్కడే ఓ వృద్ధురాలు చేతిలో కాగితం పట్టుకొని ఆవేదనతో ఎదురుచూస్తుండటం గమనించారు. వెంటనే వేదికపై నుంచి దిగిన మంత్రి, ఆ వృద్ధురాలిని ఆప్యాయంగా వేదిక మీదకు పిలిచి, ఆమె పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆ వృద్ధురాలు తన పేరు వేల్పుల ఊర్మిళ అని, 41వ డివిజన్ శంభునిపేటలో నివాసమని తెలిపారు. తన మనవరాలు వేల్పుల లిటి ఇటీవల 4వ తరగతి పూర్తి చేసి, సెయింట్ గాబ్రియెల్ పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశ పరీక్ష రాసి సీటు సాధించిందని చెప్పారు. అయితే లిటి తల్లిదండ్రులు మనస్పర్థల కారణంగా వేరుగా ఉంటుండటంతో చిన్నారి చదువు భారం తనపై పడిందనీ, ఆర్థికంగా అది తాను భరించలేనని వాపోయారు. విషయాన్ని తెలుసుకున్న మంత్రి వెంటనే స్పందించి, చిన్నారి చదువుకు అయ్యే ఖర్చును తానే భరిస్తానని హామీ ఇచ్చారు. మంత్రి పొంగులేటి ఉదారతను పలువురు హర్షాభిమానాలతో కొనియాడారు.

# పకడ్బందీగా సన్న బియ్యం పంపిణీ




**వరంగల్ వాయిస్, వరంగల్:** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బీఆర్‌నగర్‌లో సన్న బియ్యం లబ్ధిదారుల గృహాలను రాష్ట్ర మంత్రులు సందర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అటవీ, దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకాడే, వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు లబ్ధిదారులతో కలిసి సన్న బియ్యంతో భోజనాన్ని చేశారు. అనంతరం ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలును పర్యవేక్షించారు.

# చెర్లపాలెంలో చెల్లని పైసా తిరుపతిరెడ్డి




**వరంగల్ వాయిస్, రాయపర్తి :** మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో..తొర్రూరు ఏఎంసీ చైర్మన్ హనుమాండ్ల తిరుపతిరెడ్డి, పీఏ మహేష్, సిగ్నేచర్ స్టూడియో ఉపేందర్ ల నిరాధారమైన వాఖ్యలను ఖండిస్తూ రాయపర్తి మండల మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాచర్ల ప్రభాకర్ విలేకర్ల సమావేశం నిర్వహించారు. అగ్రరాజ్యం అమెరికాలో ఉన్నత స్థాయిలో ఉన్న ఝాన్సీ రెడ్డి తన అత్తగారి ఊరైన చర్లపాలెంతో పాటు పాలకుర్తి నియోజకవర్గం ప్రజలందరికీ అందుబాటులో ఉండి సేవ చేయాలనే లక్ష్యంతో రాజకీయాల్లోకి వచ్చారన్నారు. ఝాన్సీ రెడ్డి రాకతో గుండెల్లో రైళ్లు పరిగెట్టిన దయాకర్ రావు ఆమె పౌరసత్వాన్ని అడ్డుకోవడంతో తన వారసత్వాన్ని (ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి) ఎన్నికల బరిలో దించి రాజకీయ ఉద్దండుగా గొప్పలు చెప్పుకుంటున్న దయాకర్ రావును మట్టి కరిపించిన విషయాన్ని జీర్ణించుకోలేని దయాకర్ రావు తన చెంచాలతో ఝాన్సీ రెడ్డి కుటుంబం పై నిందారోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. తాను పుట్టిన చర్లపాలెంలో ప్రజలందరికీ తెలియని తిరుపతిరెడ్డిని కన్నతల్లి వలె ఝాన్సీ రెడ్డి ఆదరించి అక్కున చేర్చుకొని అనతి కాలంలోనే తొర్రూరు మార్కెట్ కమిటీ చైర్మన్ గా బాధ్యతలు అప్పగించి పాలకుర్తి ప్రజలందరికీ పరిచయం చేసిన సంగతి మర్చిపోయి మాట్లాడడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో రాయపర్తి మండల సీనియర్ నాయకులు మచ్చ నిలయ్య, మండల ఉపాధ్యక్షులు వల్లపు కుమారస్వామి, మండల మైనారిటీ సెల్ అధ్యక్షులు ఎండీ అఫ్రోజ్, మాజీ మండల యూత్ అధ్యక్షులు ఎండీ మహమూద్, రాయపర్తి పట్టణ అధ్యక్షులు మచ్చ రమేష్, మండల నాయకులు తీగల సాయిలు, కందికట్ల యాకయ్య, బన్షా నాయక్, నరసింహుల రాంమూర్తి, దేదావత్ రామ నాయక్, ఉబ్బని నవీన్, ఎల్లయ్య, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలు పరిష్కరించాలి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** స్థానిక జేఎన్టీయూహెచ్ కళాశాలలోని నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ మహబూబాబాద్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గందసిరి జ్యోతిబసు, పట్ల మధులు డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా నాయకత్వం జేఎన్టీయూ కాలేజీలోని సమస్యలు విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు సింహాద్రి, జిల్లా సహాయ కార్యదర్శి నిక్షిప్త, పట్టణ కార్యదర్శి రాకేష్, జేఎన్టీయూ కాలేజ్ నాయకులు వాసు, గణేష్, మహేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లను సజావుగా నిర్వహించాలి

- సఖి కేంద్రం ఫిర్యాదులకు వెంటనే స్పందించాలి
- కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**వరంగల్ వాయిస్, జనగామ :** ధాన్యం కొనుగోళ్లను సజావుగా నిర్వహించాలని, ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రంలో ఓపీ సేవలను మరింతగా పెంచాలని, సఖి కేంద్రం సహాయక నంబర్ కు వచ్చే ఫిర్యాదుల పట్ల తక్షణమే స్పందించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మంగళవారం జిల్లాలో సుడిగాలి పర్యటన చేశారు. జిల్లాలోని వెంకిర్యాల, గానుగుపహాడ్ గ్రామాల పరిధిలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సందర్శించి, పర్యవేక్షించారు.ఈ సందర్భంగా కేంద్రంలో రైతులు ఆరబోసిన ధాన్యం తేమ శాతాన్ని, ధాన్యం కొనుగోళ్ల రిజిస్టర్ లను తనిఖీ చేసి, ఓపీఎంఎస్ లో ఎప్పటికప్పుడు నమోదు చేస్తున్నారా? రైతులు కేంద్రంలో ఆరబోసిన ధాన్యం తేమ శాతాన్ని ప్రతిరోజూ పరిశీలిస్తున్నారా? సకాలంలో ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తున్నారా? అలాగే కేంద్రంలో రైతులు ఆరబోసిన ధాన్యం కుప్పల గురించి పలు వివరాలను కేంద్ర నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో వారు స్పందిస్తూ.. ఎప్పటికప్పుడు ధాన్యం కొనుగోలు




వివరాలను ఓపీఎంఎస్ లో నమోదు చేస్తున్నామని, కేంద్రంలో రైతులు ఆరబోసిన ధాన్యం తేమ శాతాన్ని కూడా ప్రతిరోజూ పరిశీలించి, కావాల్సిన తేమ శాతానికి రాగానే కాంటా పూర్తిచేసి మిల్లులకు తరలిస్తున్నామని కేంద్ర నిర్వాహకులు కలెక్టర్ కు వివరించారు. అనంతరం గానుగుపహాడ్ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి, ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలోని సిబ్బందికి సంబంధించిన హాజరు రిజిస్టర్ లను పరిశీలించి, తగు సూచనలు చేశారు. తదనంతరం జిల్లాలోని వడ్లకొండ రోడ్డులో గల సఖి కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి, పరిశీలించారు.

ఈ నేపథ్యంలో సంబంధిత రికార్డులను తనిఖీ చేసి, స్టాఫ్ రూం, కౌన్సెలింగ్ గదులను తనిఖీ చేశారు. అలాగే మహిళలకు అందిస్తోన్న సేవల గురించి ఆరా తీశారు. ఇప్పటివరకు వచ్చిన ఎన్ని ఫిర్యాదులకు పరిష్కారం చూపించారని? బాల్య వివాహాల నిర్మూలనకు తీసుకుంటున్న చర్యలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని సూచించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట తహసీల్దార్ హుస్సేన్, డీటీ సీఎస్ శ్రీనివాస్, సఖి కేంద్రం నిర్వాహకురాలు రేణుక, ఇతర సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మాజీ సీఎం కేసీఆర్ పై బీజేపీ మండిపాటు

- ఉగ్రదాడిపై స్పందించ లేదని విమర్శ



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** జమ్మూ కాశ్మీర్‌లో పర్యాటకులపై జరిగిన ఉగ్రవాద దాడిని ఖండించకపోవడంపై బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్ గౌడ్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. మంగళవారం ఆత్మకూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. "పాకిస్తాన్ మద్దతుతో జరిగిన ఉగ్రవాద దాడిలో హిందూ పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనను ప్రపంచ దేశాలు ఖండిస్తున్నా, మన రాష్ట్ర మాజీ సీఎం కేసీఆర్ గానీ, మంత్రి కేటీఆర్ గానీ స్పందించకపోవడం దురదృష్టకరం," అని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ హిందూ వ్యతిరేక ధోరణిని విపక్ష నాయకుడు అభివ్యక్తం చేశారు. "పార్టీలో ఉన్న హిందువులు వెంటనే బీజేపీలో చేరాలి. దేశం కోసం పనిచేస్తున్న ప్రధాని నరేంద్ర మోడీకి మద్దతు ఇవ్వాలి," అని పిలుపునిచ్చారు. హిందువుల నమ్మకాన్ని దోచుకుంటూ, రాజకీయ లబ్ధి కోసం మతాన్ని ఉపయోగించే నాయకులతో పనిచేయకూడదని ఆయన హెచ్చరించారు. "కేసీఆర్, కేటీఆర్‌ను నమ్మితే హిందువుల భద్రత కష్టమే," అని వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఉప్పుగల్ శ్రీకాంత్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు ఇరుసట్ల సదానందం, మండల ప్రధాన కార్యదర్శి బయ్యపైడి కళ్యాణ్, బీజేవైఎం అధ్యక్షుడు పోరెడ్డి ప్రతీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ మండల అధ్యక్షుడిపై దాడి

- పార్టీ సభ్యులే హింసకు పాల్పడిన ఘటన
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడి భార్య
- వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్




**వరంగల్ వాయిస్, నడికూడ :** నడికూడ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్‌పై సొంత పార్టీ నాయకులే దాడికి పాల్పడ్డారు. సోమవారం నాడు, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరైన "జై బాపూ – జై భీమ్ – జై సంవిధాన్" కార్యక్రమాన్ని నడికూడ మండల కేంద్రంలో బుర్ర దేవేందర్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమం ముగిశాక ఆయన తన నివాసానికి వెళ్తుండగా, నర్సక్కపల్లి బస్‌స్టాప్ సమీపంలోని రైస్‌మిల్ వద్ద ఆల్టో కారు, పల్సర్ బైక్‌పై వచ్చిన నర్సక్కపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు నాగుర్ల శ్రీనివాస్, నాగుర్ల నగేష్, నాగుర్ల వెంకటేష్, లోనే వెంకటేష్‌లు బుర్ర దేవేందర్ గౌడ్‌ను అడ్డగించి అతనిపై బండలతో దాడి చేసి తీవ్రంగా గాయపర్చినట్లు సమాచారం. ఈ ఘటనపై బాధితుడి భార్య, నర్సక్కపల్లి ఎంపీటీసీ బుర్ర దీప పరకాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తన భర్తకు ప్రాణహాని ఉన్నందున చర్యలు తీసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఆమె మాట్లాడుతూ, "పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఆశీస్సులతో బుర్ర దేవేందర్ పార్టీ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొంటూ పనిచేస్తున్నారు. అలాంటి నాయకుడిపై తాను ఉన్న పార్టీలోనే కొందరు నాయకులు దాడికి పాల్పడటం దురదృష్టకరం" అని ఆవేదన వ్యక్తం చేశారు.

## దాడికి పాల్పడ్డ వారిని సస్పెండ్ చేయాలి..

### బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈర్ల చిన్ని

ఈ ఘటనపై స్పందించిన పరకాల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈర్ల చిన్ని, దాడికి పాల్పడిన నేతలపై కఠిన చర్యలు తీసుకోవాలని, కాంగ్రెస్ పార్టీ నుంచి వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు.



# ఎన్టీఆర్-నీల్ కాంబినేషన్

## 2026 జూన్ రిలీజ్ అంటూ ప్రకటన

ఎన్టీఆర్–ప్రశాంత్ నీల్ ఈ కాంబినేషన్లో సినిమా అనగానే అంచనాలు ఆకాశాన్నంటాయి. కెజియఫ్, సలార్ సినిమాల తర్వాత ప్రశాంత్ నీల్ చేస్తున్న సినిమా కావడం ఒకట్టైతే ఇది ఆయన డ్రీమ్ ప్రాజెక్ట్ అవడం టైగర్ ఫ్యాన్స్ ఈ సినిమాపై భారీ అంచనాలు పెట్టుకున్నారు. అత్యంత భారీ బడ్జెట్ పై తెరకెక్కుతున్న ఈ సినిమాలు టాలీవుడ్ టాప్ ప్రొడక్షన్ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ తో పాటు ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. కన్నడ భామ రుక్మిణి వసంత్ హీరోయిన్ గా నటిస్తుండగా రవి బస్రుర్ సంగీతం అందిస్తున్నారు.కాగా ఈ సినిమాను 2026 సంక్రాంతి కానుకగా రిలీజ్ చేస్తామని పూజా కార్యక్రమాలు నిర్వహించిన రోజు ప్రకటించారు మేకర్స్. కానీ అనుకోని కారణాల కారణంగా షూటింగ్ వాయిదా పడుతూ వస్తుండడం, మధ్యలో వార్ 2కు ఆగష్టులో ప్రమోషన్స్ కోసం డేట్స్ ఇవ్వాల్సి ఉండడం వంటి కారణంగా ఈ సినిమా సంక్రాంతికి రాదు అనే వాదనలు వినిపించాయి. ఆ వాదనలకు తెరదించుతూ న్యూ రిలీజ్ డేట్ ను ప్రకటించారు మేకర్స్. 2026 జూన్ 25న ఎన్టీఆర్ నీల్ సినిమాను రిలీజ్ చేస్తామని అనౌన్స్ చేసారు. అలాగే యంగ్ టైగర్ పుట్టిన రోజు కానుకగా మే 20న న ఎన్టీఆర్, నీల్ సినిమా గ్లిమ్స్ రిలీజ్ చేయనున్నట్టు ప్రకటించారు మేకర్స్. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. వారం క్రితం యంగ్ టైగర్ ఈ సినిమా సెట్స్ లో పాల్గొన్నారు.




# హిట్ – 3తో వస్తున్న నాని


హ్యాట్రిక్ హిట్స్‌తో మంచి జోష్ మీదున్నాడు నాని. దసరా, సరిపోదా శనివారంతో హండ్రెడ్ క్రోర్ హీరోగా ఛేంజయిన న్యాచురల్ స్టార్ నుండి వస్తోన్న చిత్రం హిట్ 3. ఇప్పటి వరకు నాని కెరీర్‌లోనే మోస్ట్ వయెలెంట్ పిక్చర్‌గా రాబోతుంది. మే 1న థియేటర్లలోకి వచ్చేస్తున్నాడు అర్జున్ సర్కార్. ఇప్పటి వరకు ఈ సిరీస్ నుండి వచ్చిన టూఫిల్మ్ప్ మంచి హిట్ కొట్టడంతో పాటు నాని హీరో కావడంతో హిట్ 3పై భారీ అంచనాలున్నాయి. అయితే హిట్ 3కి టఫ్ కాంపిటీషన్ ఇచ్చేందుకు హాలీవుడ్ తో పాటు కోలీవుడ్ చిత్రాలు వచ్చేస్తున్నాయి. సంక్రాంతి సీజన్ తర్వాత ఇప్పటి వరకు డ్రై సీజన్ నడిచింది. కొన్ని అడపా దడపా చిత్రాలు కొన్ని డబ్బింగ్ మూవీస్ సందడి చేశాయి. ఏప్రిల్ మొత్తం బాక్సాఫీస్ డల్ అయ్యింది. ఇప్పుడు మేలో వచ్చే సినిమాలపైనే హోప్స్. మేడేన వచ్చేస్తున్నాడు నాని. ఇదే సినిమాను పాన్ ఇండియా భాషల్లో డబ్ చేసి రిలీజ్ చేస్తున్నారు. అయితే సౌత్, నార్త్ బెల్టులో హిట్ 3తో కొన్ని సినిమాలు పోటీపడుతున్నాయి. ముందుగా సూర్య.. హిట్ 3కి పోటీగా రెట్రోను మల్టీ లాంగ్వేజ్‌లో సినిమాను దింపుతున్నాడు. అలాగే టూరిస్ట్ ఫ్యామిలీ తమిళనాడులో రెట్రోతో పాటు హిట్ 3కి పోటీగా రాబోతుంది. హిందీ బెల్ట్‌లో చూస్తే సీనియర్లు అజయ్ దేవగన్ 2018లో వచ్చిన సక్సెస్ ఫుల్ మూవీ రైడ్‌కు సీక్వెల్‌గా రైడ్ 2 మే 1న రిలీజ్ చేస్తున్నాడు. సంజయ్ దత్ ది భూత్నీ కూడా అదే రోజు భయపెట్టేందుకు వస్తోంది. ఈ సినిమాలకే పిచ్చ కాంపిటీషన్ ఉంటే హాలీవుడ్ నుండి థండర్ బోల్ట్స్ వివిధ భాషల్లో రిలీజౌతుంది. ఇంత టఫ్ కాంపిటీషన్ ఉన్నప్పటికీ.. డేర్ చేసి వస్తున్నాడు నాని. ఇప్పటికే విపరీతమైన ప్రమోషన్లను చేసిన న్యాచురల్ స్టార్. వీటికి తోడు ఐపీఎల్ ఉండనే ఉంది. మరీ ఇన్ని అవరోధాలను దాటుకుని నాని హిట్ 3 ఎలాంటి హిట్ కొడతాడో చూడాలి.





# హీరోల కోసం త్రివిక్రమ్ చూపు

### వెంకటేశ్‌తో చేస్తాడన్న ప్రచారం

మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ పైనే అందరి చూపు ఉన్నా..ఆయన చూపు ఎవరి వైపు అన్నదే ఇప్పుడు చర్చ. నిత్యం పెద్ద హీరోలు, భారీ బడ్జెట్ సినిమాలతో త్రివిక్రమ్ కాంపౌండ్ కళరళలాడేది. కానీ ఇప్పుడు వెలవెల బోతోంది. త్రివిక్రమ్ తో సినిమా చేసేందుకు హీరోలు దొరకని పరిస్థితి. హీరో అంటే ఇక్కడ స్టార్ హీరోలండి బాబు. ఈ పరిస్థితి రావడానికి కారణం కూడా మన గురూజీనే. కేవలం స్టార్ హీరోలతో మాత్రమే సినిమాలు చేస్తానని పట్టుబడతాడు. అదే దెబ్బ కొట్టేసింది. ఎందుకంటే స్టార్ హీరోలు అందరూ పాన్ ఇండియా బడ్జెట్ లో చేసేస్తున్నారు. పైగా రియలస్టిక్ సినిమాలకే జెండా ఊపుతున్నారు. క్లాస్ సినిమాలు తీసే త్రివిక్రమ్ కు ఇది అడ్డంకిగా మారింది. బన్నీతో సినిమా ఉంటుందని ప్రచారం జరిగినా.. అది ఇప్పట్లో ఉండేలా కనిపించలేదు. అట్లీ మూవీ అయ్యాకే ఉంటుంది. దానికి ఇంకో మూడేళ్లు పడుతుంది. అప్పటి దాకా ఖాళీగా ఉండటం కన్నా వెంకటేశ్ తో తీస్తే బెటర్ అంటున్నారు. కానీ దానికి త్రివిక్రమ్ నుంచి గ్రీన్ సిగ్నల్ రావట్లేదు. త్రివిక్రమ్ తో చేయడానికి వెంకీ సిద్ధంగానే ఉన్నాడు. ప్రస్తుతం భారీ హిట్ తో ఖాళీగా ఉన్నాడు. కాబట్టి వెంకీతో మూవీ చేసి తానేంటూ త్రివిక్రమ్ నిరూపించుకుంటే బెటర్ అంటున్నారు ఆయన ఫ్యాన్స్. వెంకీ నటించిన ఎన్నో బ్లాక్ బస్టర్ సినిమాలకు త్రివిక్రమ్ డైలాగులు రాశాడు. ఇద్దరి కాంబోలో వచ్చిన నువ్వు నాకు నచ్చావ్ పెద్ద హిట్. కాబట్టి మళ్లీ ఓ మూవీ చేస్తే బాగుంటుందని వీరి ఫ్యాన్స్ అంటున్నారు. మరి త్రివిక్రమ్ ఏం చేస్తాడో చూడాలి.





# ‘భూ భారతి’ రైతులకు శ్రీరామరక్ష

- అన్ని సమస్యలకు అదే పరిష్కారం
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**వరంగల్ వాయిస్, వరంగల్ :** భూ భారతి చట్టంలో ప్రతి భూ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని.. రైతులకు భూ భారతి చట్టం శ్రీరామరక్ష అని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. భూ భారతి–2025 చట్టంపై నిర్వహిస్తున్న అవగాహన సదస్సుల్లో భాగంగా మంగళవారం వరంగల్ పట్టణంలోని నాని గార్డెన్స్ లో నిర్వహించిన కార్యక్రమానికి రాష్ట్ర అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండ సురేఖ, నగర మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాఖేడేలతో కలసి రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. సభా ప్రారంభానికి ముందుగా తెలంగాణ రాష్ట్ర గీతం ఆలపించారు. ఈ సందర్భంగా భూభారతి చట్టంపై ముఖ్యమంత్రి సందేశాన్ని వినిపించారు. ఈ అవగాహన సదస్సులో ముందుగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న భూభారతి చట్టంలోని అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రదర్శించగా అందులోని అంశాలను జిల్లా కలెక్టర్ సత్య శారద కూలంకషంగా వివరించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో నెలకొన్న భూ సమస్యల పరిష్కారానికి దేశంలోని 18 రాష్ట్రాలకు చెందిన రెవెన్యూ చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించామని, దేశానికి రోల్ మోడల్ గా భూభారతి చట్టాన్ని రాష్ట్రంలో అమల్లోకి తీసుకు వచ్చామని అన్నారు. రైతుల వారసత్వంగా వచ్చే భూమిలో అనుభవించలేక అనేక సమస్యలు ఏర్పడ్డ ఈ ధరణి నుంచి చిన్న చిన్న సమస్యలు మార్చుకొనుటకు ప్రతిదీ కోర్టు ద్వారా పరిష్కరించుటకై నిరుపేద రైతులకు సాధ్యం కాలేదని, కానీ ప్రస్తుతం ఉన్న ప్రజా పాలన ప్రభుత్వ రైతు శ్రేయస్సు కోసం సమస్యలు పరిష్కరించుటకు రెండంచల వ్యవస్థను తీసుకువచ్చి రైతులకు అండగా నిలిచిందన్నారు. భూ భారతి చట్టం రైతుల పాలిట భద్రత నేస్తం అని అన్నారు. సభాముఖంగా రైతులైన కొంగరి భాస్కరరావు, విజయ్ కుమార్, గోపాల రాధాకృష్ణ యొక్క సమస్యలను నేరుగా అడిగి తెలుసుకుని పరిష్కరించుటకు మంత్రి అధికారులను ఆదేశించారు.

రాష్ట్ర అటవీ పర్యావరణ మంత్రి కొండ సురేఖ మాట్లాడుతూ ఆత్యంత ప్రతిష్టాత్మకమైన భూభారతి చట్టం ప్రయోజనాలు సామాన్య ప్రజలకు చేరినప్పుడే దానికి సార్ధకత ఏర్పడుతుందన్నారు. రైతులు, ప్రజల మేలు కోసం ఈ చట్టాన్ని తీసుకువచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు. భూ సమస్యలు లేని రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దాలన్న లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో భూభారతి చట్టాన్ని తీసుకువచ్చామని అన్నారు. భూ భారతి చట్టంపై ప్రజల్లో అవగాహన కల్పించడంతోపాటు, పకడ్బందీగా అమలు చేయాలన్న లక్ష్యంతో జిల్లాలోని అన్ని మండలాల్లో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

నగర మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ భూభారతి చట్టం ఎంతోమంది మేధావులు, రైతులు, ఎన్నో వర్గాల అభిప్రాయాలు, ఆలోచనల మేరకు చేసినదే ఈ చట్టం అని అన్నారు. ఈ చట్టం వందేళ్లు వర్ధిల్లుతుందని అన్నారు. భూ సమస్యల పరిష్కారానికి ఈ చట్టం ద్వారా రైతులకు



న్యాయం జరుగుతుందన్నారు. రైతులు, ప్రజలు ఈ చట్టంపై పూర్తి అవగాహనను పెంపొందించుకోవాలని కోరారు.

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ రైతులకు భూమి అంటే ఆత్మగౌరవం, విశ్వాసమని అన్నారు. రైతుకు భూమికి విడదీయని బంధం ఉంటుందన్నారు. రైతులకు అనేక సందర్భాలలో భూమి అండగా ఉంటుందన్నారు. ధరణి పోర్టల్ తీసుకురావడంతో రైతులు ఇబ్బందులు పడ్డారని అన్నారు. రైతుల పక్షాన రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన భూభారతి చట్టం ద్వారా రైతులకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాఖేడే, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, స్థానిక కార్పొరేటర్ పల్లం పద్మరవి, కార్పొరేటర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, రెవెన్యూ, సంబంధిత శాఖల అధికారులతో పాటు వరంగల్, ఖిలా వరంగల్ మండలాల్లోని రైతులు, ప్రజలు పాల్గొన్నారు.









## శ్రీ భద్రకాళీ, భద్రేశ్వరుల కళ్యాణ బ్రహ్మోత్సవాలకు.. అంకురార్పణ

- ప్రారంభించిన కుడా చైర్మన్ ఇనగాల
- ఉభయదాతలుగా వ్యవహరించిన కాపు కులస్తులు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** చరిత్ర ప్రసిద్ధిగాంచిన భద్రకాళి దేవాలయంలో ఏప్రిల్ 29 నుంచి మే 10 తేదీ వరకు నిర్వహించనున్న శ్రీ భద్రకాళీ, భద్రేశ్వరుల కళ్యాణ బ్రహ్మోత్సవాలకు మంగళవారం అంకురార్పణ జరిగింది. ఉదయం 4 గంటలకు అమ్మవారికి నిత్యాహ్నికం నిర్వహించిన పిమ్మట ఆలయ అర్చకులు అమ్మవారికి ఉత్సవాంగీకార ప్రార్ధన జరిపారు. అనుజ్ఞ లభించిన వెంటనే అమ్మవారికి బ్రహ్మోత్సవ కార్యక్రమాలను ప్రారంభించారు. తొలి రోజు కార్యక్రమంలో భాగంగా ముందుగా గణపతి పూజ, పుణ్యహవాచనం, నాంది, ఇడాహవాచనం, బ్రహ్మకూర్చహెూమం, పంచగవ్య ప్రాశన, ఋత్విగ్వరణం, మధుపర్కవిధి జరిపి వాస్తుయాగం, పర్యగ్నికరణం, మృత్సంగ్రహణం, ధ్వజాధివాస కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం గణవతి సేవను, సాయంకాలం శ్రీ సుబ్రహ్మణ్య సేవ నిర్వహించారు. ఈ బ్రహ్మోత్సవాలను కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్ ఇనుగాల వెంకట్రాం రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం ప్రతిసరబంధం, ఉదకశాంతి నిర్వహించి రక్షోఘ్న హెూమం అనంతరం బ్రహ్మోత్సవ అంకురార్పణ జరిపి సాయంతన పూజ నిర్వహించడంతో ఈ రోజు కార్యక్రమం పూర్తయింది. అంకురార్పణ కార్యక్రమానికి వరంగల్ ఉమ్మడి జిల్లా మున్నూరు కాపు సంఘం వారు ఉభయదాతలుగా వ్యవహరించారు. ఆలయానికి విచ్చేసిన మున్నూరుకాపు సంఘం సభ్యులు వందలాదిగా ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కటకం పెంటయ్య నేతృత్వంలో మేళతాళాలతో పట్టుచీరలు, పూజాద్రవ్యాలు అమ్మవారికి సమర్పించి పూజాదికములు నిర్వహింపజేశారు. బ్రహ్మోత్సవాల ధ్వజారోహణకు ధ్వజపటాన్ని అత్యంత సుందరంగా తయారు చేసి ఇచ్చిన ఇంజనీరింగ్ విద్యార్థి గండ్రాతి వర్షన్ను ఆలయానికి విచ్చేసిన భక్తులు అభినందించారు. ఆలయ ఉత్సవ ధ్వజారోహణ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు మానసిక, శారీరక రోగాలు తొలగిపోతాయని ధ్వజారోహణ సందర్భంలో నివేదించిన ప్రసాదాన్ని భుజించడం వల్ల గర్భదోషాలు తొలగిపోయి సంతానవంతులౌతారని ప్రధానార్చకులు భద్రకాళి శేషు తెలిపారు.

### భక్తులకు మెరుగైన సౌకర్యాలు..

ఆలయ ప్రాంగణమంతా భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్ళు, పెండాల్స్ ఏర్పాటు చేశారు. చల్లటి తాగునీరు, ఉచిత ప్రసాద వితరణ తదితర ఏర్పాట్లను దేవాలయ కార్యనిర్వహనాధికారి, అసిస్టెంట్ కమీషనర్ శేషుభారతి చేశారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా వేలాదిగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. బుధవారం ఉదయం 11 గంటలకు ధ్వజారోహణ కార్యక్రమంతో 10 రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని, యావన్మంది భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులవ్వాలని ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు కోరారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com